# అగమ్యాగమ్యస్థానం

బస్సు నిండుతోంది. ఒక్కొక్కరే, ఒక్కొక్కరే వచ్చి ఎక్కుతున్నారు. కండక్టరు గడియారం చూసుకుని, టైము వేసుకున్నాడు అదేదో అట్టమీద. సాయంకాలం 5-30 చెబుతోంది సికిందరాబాదు స్టేషను గడియారం. మీనాక్షి చేతిలోని సంచి గట్టిగా పట్టుకుని, దట్టంగా కనిపిస్తున్న జనంవేపు చూస్తోంది. నల్లని ఆమె పట్టుచీర ఒంటికి నిండుగా వుంది. తెల్లని పూలను కప్పివేసే విధంగా, తలమీదనుంచి లాక్కుంది పమిటను. బస్సు తృప్తిగా 'గ్రు'మని శబ్దంచేసి బయలుదేరింది-కలకలలాడే ప్రయాణీకులతో. చలిగాలి వీస్తోంది...

...............మీనాక్షికి అప్పట్లో 12 ఏళ్ళు. పెద్దమండువాలోగిలి వాళ్ళది. ఇంటినిండా ఎప్పుడూ కిటకిటలాడే జనం. మీనాక్షి ఒక్కత్తే సంతానం ఆమె తల్లిదండ్రులకి. ఐనా, ఇంటినిండా పిల్లలు, బంధువుల తాలూకువాళ్ళు, చాలామంది వుండేవారు. అదో సత్రంలాంటి ఇలు. తండ్రికి మీనాక్షి అంటే ప్రాణం-సహజమే. తనకి తమ్ముడు పుడతారని చెప్పారు అంతా. ఎగిరి గంతులు వేసింది.

అమ్మకి నొప్పులు వస్తున్నాయని అందరూ గాభరాపడారు ఒకమునిమాపు వేళ. తండ్రి కాళ్ళు, చేతులు ఆడక అరుగుమీద పచార్లుచేస్తూ, తనని దగ్గిరగా పిలిచాడు. హాల్లో లాంతరు వ్రేలాడుతోంది. మీనాక్షికి తెలిసీ తెలియనితనం. 'పాపాయి వద్దు నాన్నా, పాపాయిని పొమ్మను. అమ్మని మూలగవద్దని చెప్పు' అన్నది. ఇంట్లో యింకా ఎవరెవరో-మేనత్త, మామయ్య, పినతల్లి వున్నారు. ఆమెని తీసుకుపోయి అన్నంపెట్టి, పడుకోపెట్టారు. అమ్మ మూలుగు వింటూనే భయపడి పోయింది మీనాక్షి. చేతులుజోడించి, 'దేముడా, దేముడా, మా అమ్మని రక్షించు, మూలగవద్దని చెప్పు' అన్నది. దేముడు రక్షిస్తానని హామీ ఇవ్వకుండానే నిద్రపోయింది.

ఆమెకి మెలకువవచ్చేసరికి తండ్రి ఆమెని కౌగిలించుకుని ఏడుస్తున్నాడు, తండ్రి ఏడవడం ఎన్నడూ చూడని ఆమె, బిత్తరపోయింది. 'నాన్నా, నాన్నా' అని ఆమె కూడా ఏడ్చింది. 'తల్లీ, నిన్ను తల్లిలేనిదాన్ని చేసిపోయిందమ్మా!' అని మళ్ళీ వాపుతున్నాడు తండ్రి.

తల్లిశవం—కాళ్ళు, చేతులు పాలిపోయి తెల్లగావున్నాయి. నిర్జీవంగా వున్న ఆ వ్రేళ్లను కదిల్చిచూసింది మీనాక్షి. నిద్రపోతున్నట్టున్న తల్లిముఖం చూసి, నాలుగైదుమార్లు 'అమ్మా, అమ్మా' అని లేపింది. వెళ్లిపోతున్న అమ్మదగ్గర వుండాలో, హృదయం పగిలేలా బయట కూర్చుని ఏడుస్తున్న తండ్రిదగ్గరుండాలో తేల్చుకోలేకపోయింది మీనాక్షి. ఆమె, తల్లిగుండెలమీద తలపెట్టి పడుకోబోతుంటే, వెనక్కిలాగేశారు ఎవరో. అంతమందివున్న ఆక్షణంలో కూడా యిల్లంతా నిర్జీవంగా అనిపించింది మీనాక్షికి. గోడలు, తలుపులు అన్నీ బావురుమని ఏడుస్తున్నట్లనిపించింది. ఎలుగెత్తి ఏడుస్తున్న తండ్రికంటే, బంధువులకంటే, ఎక్కువ మూగగా బావురుమని ఏడుస్తోంది ఆయిల్లు. మీనాక్షి తనుకూడా చచ్చిపోదామనుకుంది. తల్లిని తీసుకుపోతుంటే తనుకూడా వెనకాలపరుగెత్తింది. బిగ్గరగా ఏడవలేదు ఆమె. బిత్తరపోయే కళ్ళతో ఎంతో దూరం పరుగెత్తింది. తను చచ్చిపోతుంది; తప్పదు. తను పుట్టినది తల్లితో పాటుపోయేందుకే.

కానీ—అంతాకలిసి లాక్కొచ్చి తండ్రిదగ్గర పడేశారు. ఆ సాయంత్రం, తనతండ్రి కూర్చున్నచోటికి, లాంతరు తీసుకువచ్చి, దీపం తనే వెలిగించింది. "అయ్యో, నేను పోతే ఈతండ్రి కళ్ళముందే యింట్లో దీపం లేకుండాపోయేదికదా" అనుకుంది. ఆ అనుకోవడంతోనే, ఆమెకి తన ఉనికిలో ఒక సార్థకత గోచరించింది. ప్రొద్దుటినుంచీ లేనిది ఆసంధ్యవేళ, తండ్రిని తలుచుకుని, మళ్ళీ మళ్ళీ ఏడ్చింది మీనాక్షి.

ఆ తరువాత రెండేళ్ళకి ఆమెకి అత్యంత వైభవంగా పెళ్ళిచేశాడు తండ్రి. ఏదో కొంత ఆస్తి అమ్మాడని తెలుసు ఆమెకి. ఆనందరావు-మీనాక్షి భర్త చాలా చక్కనివాడు. ఫలానావారి అలుడు ఇంద్రుడు, చంద్రుడని వూరంతా అనుకోగా విని, మీనాక్షితండ్రి చాలా ఆనందించాడు. పెళ్ళి సమయంలో మీనాక్షిని మధుపర్కాలతో చూడలేకపోయాడు తండ్రి.

పెండ్లి నాల్గురోజులు మీనాక్షి తండ్రి చూపును ఎదుర్కోడానికి భయపడింది. రెండు హృదయాలు ఒకేమాదిరి స్పందిస్తున్నాయి. కళ్లెత్తి ఒకరినొకరు చూస్తే ఆబాధ పరస్పరం అవగాహన ఔతుంది. కట్టలు త్రెంచుకుని ప్రవహిస్తుంది దుఃఖం. కానీ సమంజసంకాదు. ఏదో తప్పు చేసిన వాళ్లలాగా ఒకరినొకరు కళ్లెత్తిచూడక, గొంతెత్తి పిల్చుకోక గడిపారు ఆరోజులు.


మీనాక్షికి తెలుసు తండ్రి తనకి పెళ్లి చేయడంవల్ల ఎంత విముక్తుడైనదీ. భర్తని కూడా తలెత్తి చూడలేదు ఆమె. తను కొత్త జీవితం ప్రారంభించవలసి వున్నది ఒక గురుతరబాధ్యత తనమీద ఉంచుతోంది ఈ వివాహం. ఒకచెట్టుని అల్లుకునివున్న లత లాంటి తన జీవితాన్ని అక్కడినుండి మృదువుగా వేరుచేసి మెల్లిగా మరొక వృక్షానికి అల్లిస్తున్నారు!

అప్పగింతలవేళ అందరూ కళ్లు తుడుచుకున్నారు, తల్లిలేని పిల్లనిచూసి. ఎండా, వాన కలిసిన ప్రకృతిలా వున్నది తండ్రి ఆనందం. చిరునవ్వుతో అల్లుణ్ణి చూస్తున్నాడు; ప్రేమగా కూతుర్ని చూస్తున్నాడు; వారిదరినీ కలిపి మురిపెంగా చూస్తున్నాడు. కానీ, ఇంతలోనే వెనక్కి తిరిగి, కళ్లు వత్తుకుంటున్నాడు ఉత్తరీయంతో..........

మీనాక్షిని పదిహేడో ఏట అత్తవారింటికి పంపారు. తనువెళ్ళేనాటికి, తండ్రి ఆర్థిక పరిస్థితి ఏమంత బాగుండలేదని, కొద్దిపాటి అప్పులున్నాయని తెలుసు ఆమెకి.

తండ్రిని విడిచి వెళ్లేటప్పుడు మీనాక్షి మనస్థితి పరిపరివిధాల వున్నది. తన అవసరం ఎక్కడ ఎంతవరకో తెలియలేదు ఆమె మనస్సుకి. తండ్రికి తను అవసరమే. కానీ ఆయనే అన్నాడు. "నువ్వు కాపురం చేస్తుంటే వచ్చి చూడాలని వుంది తల్లీ, నా మనుమడిని ఎత్తుకుని ఆడించాలని వున్నది మీనా" అని. తను సిగ్గుపడితే, ఆయన బోసినోటితో నవ్వు-చిలకరించాడు. తండ్రికి తను ఏమిచేస్తే సుఖంకలుగుతుందో తేల్చుకోలేకపోయింది మీనాక్షి. తండ్రిని విడిచి వెళ్లిపోయి, తన గృహంలో తనుండడమే ఆయన మనస్సుకి సమ్మతమేమో అనుకుంది.

కాపురానికివెళ్లిన క్రొత్తలో భగవంతుడికి ఎన్నిమార్లో కృతజ్ఞతలు చెప్పుకుంది మీనాక్షి-ఎంతో అనుకూలుడైన భర్తనూ, ప్రేమమూర్తులైన అత్త, ఆడబడుచులను ఇచ్చినందుకు. ఆనందరావుకి తండ్రి లేడు, అతను తన మామగారంటే ఎంతో ఆపేక్షగా



వుంచేవాడు.

కూతుర్ని చూడడానికి ఒక మాటు వస్తూ, దస్తావేజులు పట్టుకువచ్చాడు తండ్రి. బాల మంతా కూతురు పేర వ్రాయించిన దస్తావేజు అది.

"అదేమిటి నాన్నా?" అని కళ్ల నీళ్ళు పెట్టుకుంది మీనాక్షి.

"నాకున్న అప్పులు కట్టేందుకు మున మేడిపలు ఆ మేర్క సావదమ్మా." అన్నాడు ఆయన. ఈ ప్రపంచంలో బంధాలన్నీ త్రెంచేసుకుంటున్నట్లు ఎందుకు చేస్తున్నాడా తండ్రి ఇల్లాంటి పనులు అని బాధ పడింది మీనాక్షి.

భర్తతో అన్నది: "మనిద్దరం వెళ్ళి ఓ నెల రోజులపాటు నాన్న దగ్గర వుండి వద్దాము" అని.

"ఎందుకు, ఆయననే ఇక్కడుండమని అడుగుదాము. నా పనులన్నీ ఏమౌతాయి మనం వెడితే?" అన్నాడతను. ఇద్దరూ కలిసి బలవంతపెట్టి వుంచేశారు తండ్రిని. ఆ నెల రోజులు ఎంతో సందడిగా అనిపించింది మీనాక్షికి. తన చిన్నప్పుడు ఇంట్లో తల్లి వున్న రోజుల్లో వున్నంత సందడిగా వుంది. 'నాన్నకి అది కావాలి, ఇది చేయాలి' అని ఎంతో సంబరపడుతూ చేసేది ఆమె.

తల్లి అధికం వున్నదని చెడతానన్నా ఆయనకి వెళ్ళిపోయాడు. వెళ్ళిన నాలుగ్గురోజులకే, ఇలు అమ్మకానికి బేరం కుదిరి నట్లు జాబు వచ్చింది మీనాక్షికి. 18 వేలకి పరిహారం చేసే క్రయదస్తావేజు వ్రాశానని,

# అగమ్యాగమ్యస్థానం

కొంత పైకం తీసుకొని, కొన్ని అప్పులు చెల్లించానని వ్రాశాడు. తల్లి అబ్దికానికి వెళ్ళలేదు మీనాక్షి ఒంట్లో బాగుండక-అసలే లేవలేని స్థితిగా వుంది ఆమెది. "తిన్న తిండి వంట పట్టడం లేదు, మీరు వీలైనంత త్వరలో రండి; వచ్చి మనుమడిని చూసుకుని వెళుదురుగాని" అని వ్రాయించింది ఆనందరావు తల్లి వియ్యంకుడికి.

ఇల్లు క్రయ దస్తావేజు రిజిష్టరు చేయించి, పైకం తీసుకున్నానని, వెయ్యిరూపాయలకి, బంగారంకొని, పుట్టబోయే మనుమడికి కావలసిన వస్తువులు, మీనాక్షికి పదివేలున్నల పెట్టె పలకసరు చేయిస్తున్నానని వ్రాశాడు తండ్రి. పైవారం ఆ వస్తువులు తీసుకుని వస్తానని కూడా వ్రాశాడు. ఆయన దస్తూరిలో ఆ కాగితంమీది అక్షరాల్లో ఆయన ఆప్యాయత దౌహిత్రుణ్ణి చూడాలన్న ఉత్సుకత గోచరించాయి మీనాక్షికి. ఆయన సంతకం చూస్తుంటే కళ్ళు చెమర్చాయి ఆమెకి ఎందుకనో......

......చలిగాలి వీస్తోంటే, తలమీదకి ఇంకొంచెం దగ్గరగా లాక్కుంది వల్లెవాటు. బస్సులో లైటు వెలిగించారు. పదిహేను. ఇరవై మంది మాత్రమే వున్నారు బస్సులో. అందరికీ టిక్కెట్లు ఇవ్వడం పూర్తిచేసి, కండక్టరు క్రింది మెట్టు వానుకుని నిలబడి దూరానికి చూస్తున్నాడు. దూరమంతా నీలంగా, పొగతో, మంచుతో నిండి కనిపిస్తోంది. మినుకుమనే దీపాలు, మూగగా, లీలగా కనుపించే మేడల గోపురాలు—ఏమి ఎంతెందో అన్న ఆలోచన వచ్చింది మీనాక్షికి......

తెల్లవారి లేస్తూనే, ఎదుటి మంచంమీద ఆనందరావు లేకపోవడం గమనించింది మీనాక్షి. తనకంటే ఎన్నడూ ముందు లేచి యెరుగడు అతను, ఈ వేళ ఎలా లేచారా అని ఆశ్చర్యపోయింది. ఆమె ముందువాలోకి వచ్చేసరికి ఎదురింటి అరుగుమీద ఆనందరావు తండ్రిగారి పాలేరు సుబ్బన్న కనుపించారు. సుబ్బన్న ఎందుకు వచ్చాడా ఇప్పుడు అనుకుంది. ఆమెని చూసి చటుక్కున ఇంటికి వచ్చాడు ఆనందరావు. అతని ముఖం మామూలుగా అనిపించలేదు.

"సుబ్బన్న ఎందుకొచ్చాడు?" అన్నది. సమాధానంకోసం గుండెలు కొట్టుకుంటున్నాయి.

"ముఖం కడుక్కునిరా మీనా, మీ నాన్నగారి ఆరోగ్యం బాగుండలేదుట. మొదటి బస్సుకి వెళ్ళిపోదాము" అన్నాడు.

మీనాక్షి గాభరాపడింది. సుబ్బన్న పైకిలు మీద వచ్చాడంటే ఎంత ఎక్కువగా వుందో నాన్నకి అనుకుంది.

వాళ్ళు ఇంటికి చేరేసరికి ఇంటి ముందు గుంపు చూసింది. క్రొత్త వెదురుగడలు, క్రొత్త కుండ ఇంటిముందు వాకిట్లో. మీనాక్షి హృదయానికి తెలుసు యిదంతా.

తండ్రి రాత్రి 2 గంటలకు ప్రాణం వదిలాడట. నిద్రలోంచి లేచి పాలేరుని, బావమరిదిని నిద్రలేపాడట. తన తల క్రిందవున్న డైరీ, డైరీలోని పైకం, తాళంచెవుల గుత్తీ ఇచ్చాడట. "మీనాక్షి పాపాయికి నా ఆశీ" అంటూనే ప్రాణంవదిలాడట.

తనస్థితి తనకే అగమ్యగోచరంగా వుంది. తల్లి మరణించినవాడు తనకూడా పోదామనుకుంది. కానీ యీనాడు-అల్లాగనిపించలేదు. 'నన్నీ దుఃఖం కదిలించలేకపోతోంది, నా హృదయం బ్రదలైపోతే బాగుండును అనిపించటంలేదు, అయ్యో! అనుకుంది. జీవితంలో తీపి వున్నది ఇంకా మీనాక్షికి.

తనని ఓదార్చేభర్తని చూసి మరింత ఏడ్చింది ఆమె. మధ్యాహ్నం నాలుగంటల వేళ మగవాళ్ళంతా తిరిగివచ్చారు. శ్మశాన భూమినుంచి. భర్తకి స్నానానికి నీళ్లు ఇచ్చివస్తూ, అతను కళ్లు తుడుచుకుంటూ అద్దుకోవడం చూసింది మీనాక్షి.

"ఊరుకోండి-ఆయన పుట్టింది మొదలు ఈ ఇంట్లోనే వున్నారు. ఈరోజు ఈయిల్లు అమ్మేసి, వేరొకచోట, ఒక రాత్రైనా నిద్రచేయలేదు. ఆయన అల్లా ఈ ఇంట్లో వెళ్ళిపోవడమే మంచిదేమో ఆయన మనస్సుకి. మా నాన్న సుఖంగా అమ్మతో కలిసిపోయింది," అన్నది. ఎఱ్ఱబారిన ఆమె కళ్లు చెమర్చడానికి కూడా నిరాకరించాయి.

తనకి కొడుకుపుట్టాడని తెలియగానే, తండ్రినే తలుచుకుంది మీనాక్షి. బారసాల నాటికి తండ్రి చేయించిన మురుగులు, చిన్ని ఎర్రరాళ్ల ఉంగరాలు, గొలుసు, మామిడిపిందెల మొలత్రాడు-అన్నీ పెట్టెలోంచి తీసింది ఆమె కొడుకు శరీరానికి అవి ఒక్కటొక్కటే అలంకరిస్తూ, 'నా చిన్నారి తండ్రివే' అని వాణ్ని ముద్దుపెట్టుకుంది. తన తండ్రి అభిమతం ఇదే కాబోలు అనుకుంది. మీనాక్షితండ్రి పేరే పెట్టారు పిల్లాడికి.

పాతికేళ్ళ ఆనందరావు కొడుకు నెత్తుకోవడానికి సిగ్గుపడేవాడు. 'నా చందమామా' అనేవాడు వాడిని. వాడిపేరు మధుసూదనరావు అని వుంటే, దాన్ని పొట్టి చేసి, 'మధు' అనిపిల్చేది మీనాక్షి. అంతా ఆనందరావు పోలికే కుర్రాడు.

మీనాక్షి జీవితంలో ఏదో వెలిగుని ఆనందం వెలివిరుస్తోంది. తన రక్తం పంచుకుని పుట్టిన పిల్లవాడు. తన జీవితానికి ఒక



"గోవు పాలిచ్చినదానికి కోటి దణ్ణాలు!"

చిత్రం: ఎమ్. రాజేశ్వరి-మద్రాసు.

సంపూర్ణత్వం తీసుకు వచ్చాడనిపించింది ఆమెకి. వీడిని కనడం కోసమే పుట్టావా నేను అనుకునేది ఆమె. ఇదివరకు ఆనందరావు ఎవరో వ్యక్తిలా కనుపించేవాడు. తనకి ఎంత సన్నిహితంగావున్నా, తన మనస్సులోని ఆలోచనల్లో ఎంతగా భాగం పంచుకున్నా—అతను వేరొక జీవిలాగానే కనిపించేవాడు. ఇప్పుడు అతనినీ, తననూ అతి దగ్గరగా ఒకే ఒక రేఖలోని బిందువులుగా తీసుకు వచ్చాడు మధు. అదృశ్యమైనప్పటికీ ఏవో బంధాలు తమ నిద్దరినీ బంధించి వేసున్నాయి. ఆనందరావు తనలోని, తన శరీరంలోని ఒక భాగంలాగ కనిపిస్తున్నాడు. తన మనస్సులోని ఆనందాన్ని తీసుకువచ్చి ఒక రాశిగాపోసి దానిని రెండుగా విడదీసి, రెండు బొమ్మలు చేసే—అవి రెండూ ఆనందరావూ, మధూ ఔతాయనుకునేది మీనాక్షి. ఇంత విశదంగా వూహాలు చేయలేకపోయినా మీనాక్షి భావ పరంపర ఇలానే వుండేది.

ఇంత ఆనందాన్ని తను భరించలేదన్నట్టు—ఒకనాడు ఆనందరావుకి పెద్ద జ్వరం వచ్చింది. నూటమూడు డిగ్రీలకు తగని జ్వరం. ఒక వారం నిలిచి తర్వాత, టైఫాయిడు అన్నాడు డాక్టరు. మధుని మాత్రం దగరకు తీసుకుని రానిచ్చేవాడు కాదు ఆనందరావు. రెండో వారం గడిచేనాటికి మీనాక్షి చిక్కి సగమైంది. లోతున పోయిన భర్త కళ్ళనుచూసే బావురుమని ఏడవాలనిపించేది ఆమెకి. వేడిగా కాలిపోతూ, సన్ననైన తన వ్రేళ్ళతో మీనాక్షి ముఖాన్ని, ముంగురులను స్పృశించేవాడు అతను.

"మీనా, నేను లేకపోతే..." అనబోతూండగా అతని నోటిని అరిచేతితో మూసి గుండెలో నీరు గుక్కుకునేది మీనాక్షి.

తను విశ్రాంతిగా, ఆనందంగా వుండడం భగవంతుడికి గిట్టదు కాబోలు అనుకుంది. ఇరవై నాలుగంటలు భగవంతుడిని మనస్సులోనే స్మరించుకుంటూ 'ఆయన్ని కాపాడు, రక్షించు' అని మొరపెడుతుండేది. ఇలా ప్రార్థిస్తుండగా తన చిన్నతనంలో జరిగిన విషయం జ్ఞాపకం వచ్చేది. తల్లి పోతున్నప్పుడు తనిల్లాగే దేవుణ్ణి ప్రార్థించి, కళ్ళు మూసుకుని నిద్రపోయింది. దేముడు వినలేదు—వినకుండా తనకు అన్యాయం చేశాడు. మీనాక్షి గుండె ఝల్లుమనేది. 'లేదు, లేదు, ఇప్పుడు వింటాడు—భగవంతుడికి తెలుసు నా సిరి. గాజు బంతిలా పగిలిపోతుంది నా హృదయం...' అనుకోడానికే భయం మీనాక్షికి.

టైఫాయిడు తగినట్టే తగ్గి తిరగబెట్టింది. ఆనందరావు తెలివి, అక్కడకూడా అడిగేవాడు కాదు ఎంత జ్వరంలోనైనా.



భోగి మంటలు
చిత్రం: పేరిశెట్ల అచ్యుతరావు, పుల్లేటికుర్రు.]

మీనాక్షి వుండాలి దగరగా. ఆమెకి అతని నుదుటి వేపి చూస్తే భయం వేసేది, కానీ, ఆ నుదుటిమీద తన చల్లనిచేయి వుంచాల్సిందే ఎప్పుడూ అతని మంచంప్రక్కన పడక్కుర్చీలో కూర్చొని, అతని కళ్ళమీద, నుదుటి మీద తన చేతులుంచేది. కాస్సేపు అల్లాగే వుంచి, తీసి చూసుకుంటే ఎర్రగా కంది పోయి వుండేవి వ్రేళ్ళు.

జ్వరతీవ్రతతోబాటు ఒక మధ్యాహ్నం సంధివచ్చింది ఆనందరావుకి...

మీనాక్షికి ఆపాయం కాలానికి యింకేమీ మిగలేదు. ఆమె కనులకు అంతా అంధకారమే కనుపిస్తోంది. భర్తొక్కడే జీవించి వున్నట్లు, మగిలిన వ్యక్తులంతా తోలు బొమ్మలాగా తన కళ్ళెదురుగా తిరుగుతున్నట్లు, అనిపించింది ఆమెకి. తను కళ్ళు తిరిగి పడిపోతే తనకి ఆధారంగా క్రింద భూమిలేదు. తను హృదయ విదారంగా రోదించి, తల వాల్చదామంటే అతని విశాలమైన హృదయం లేదు. తలను నిమిరి తన కన్నీరు తుడిచే అతని చల్లని చెయిలేదు. తన హృదయంలోని బాధలన్నిటినీ మూటంకట్టి అందచేసేందుకు అతను లేడు. సగంభీరమైన అతని మూర్తిలేదు. మీనాక్షి మరణిద్దామనుకుంది. ఈ లోకం నుంచి నిష్క్రమించాలి, యిక్కడ బ్రతుకు దుర్భరం, అనుకుంది.........

.........బస్సు కుదుపుకి ఉలిక్కిపడింది మీనాక్షి. తన కళ్ళవెంబడి నీరు కారుతుందేమో. తుడుచుకుందామనుకుంది. లేదు, తడిలేదు కళ్ళల్లో. తనలోపలే ఏదో ఘనీభవించి యింకా యింకా బరువవుతోంది. బస్సు దాదాపు ఖాళీ ఐపోయింది. ఒకచోట ఆగింది బస్సు. ఇంజను ఆపలేదు డ్రైవరు. విపరీతమైన శబ్దం, జోకు తెప్పించే కుదుపు—దిగిపోదామని లేచింది మీనాక్షి.

కండక్టరు మెట్టుమీదే నిల్చివున్నాడు. "ఇంకా రెండు స్టాపింగులు వున్నాయమ్మా అఫ్జల్ గంజ్ కి" అన్నాడు. మీనాక్షి కూర్చుంది. 'ఔను, గమ్యస్థానం చేరనిదీ దిగిపోనివ్వడు వీడు, ఎవరైనా అంతే—నా టిక్కెట్టుమీద ఇంతవరకు పోవాలని వ్రాసి పెట్టవుంది'.........తను మరణించలేదు. అంధకారాన్నే చూస్తూ, కుమిలిపోవడానికి, భర్త అడుగుజాడలో వెళ్ళిపోవడానికి, వీలేదు తనమీదే ప్రాణాలుంచుకుని, మెరిసే కళ్ళతో చూసే. చిన్నారి వదనం ఒకటి తనవేపు ఆశగా చూస్తోంది. ఆ జీవిని తనవడిలోకి తీసుకుని, ఆశ్రయం, ఆదరం కలిగించవలసిన బాధ్యతవుంది తనమీద. మూడేళ్ళ

మధుని కౌగిలించుకుని బిగ్గరగా ఏడ్చింది మీనాక్షి—నిరాధారంగా.

తెల్లవారడం మానలేదు మళ్ళీ రాత్రి కావడం ఆగిపోలేదు. అన్ని పనులు జరుగుతున్నాయి. మీనాక్షి! అనుమానం వేస్తుంది. ఏమిటీలోకం? ఏమిటీ మనుష్యులు? మనకు సన్నిహితులైన వ్యక్తులు ఒకనాడు లేకుండా పోతారని వూహించుకుని, ఆ స్థితిని తలుచుకుని ఎంతగా బాధపడతాము! ఆ ఊహకే భయపడి, ఆ వ్యక్తులు లేని మరుక్షణం లోకమే వుండదని మనలో మనం అనుకుంటాం. కాలానికి అంతు అదేనని వాళ్ళతో పాటే ఆకాశంకూడా అంతమై, అదృశ్యమై పోతుందని, మనంకూడా దుఃఖములో కరిగిపోతామని, లేక కొండలతో పాటు ఘనీభవించి పోతామని — అన్నీ అనుకుంటాము. అల్లాగనుకుని మనకుమనమే విలువ నిచ్చుకుంటాము. మనతోటివాళ్ళ జీవితాలకి అమూల్యమైన వెలకడతాం.

కానీ—అల్లాగేమీ జరుగలేదు. ప్రపంచానికి ఏమీ వెలితిరాలేదు, ప్రకృతికి ఏమీ కొరత తగలేదు. మన మనస్సుకి ఒక గాయం తగిలింది. అది మానకుండా వున్నా, ఆ గాయం ఉండడమనేది అలవాటై పోయింది. మన జీవితంలో ఈ బాధకూడా ఒక అత్యవసరభాగం ఐపోయింది.

జీవితంలో కష్టాలు వస్తాయి, సుఖాలు వస్తాయి—సుఖాలతో ఉబ్బితబ్బిబ్బులయి, హృదయం దూదిపింజయై పోగా తేలిపోతాము. కష్టాలు వచ్చినప్పుడు దుఃఖంతో కృంగిపోయినా, కళ్ళుమూసుకుని గంభీరంగా వాటిని ఎదుర్కొంటాము. అన్ని అనుభవాలు, అనుభూతులు మానవజీవితంలో భాగాలు. అన్నీ కలిసినదే ఒక సంపూర్ణత్వమున్న జీవితం...నా జీవితమింతే అనుకునేది మీనాక్షి.

తనను ఎగసిపోనీక, తన హృదయాన్ని తన ఇష్టంవచ్చినట్లు ముక్కలు చేసుకోనీక అడుపడే బంధాలు ఉన్నాయి. ఆ బంధమే మధు—

మధు పెరిగి పెద్దవాడయ్యాడు. వానికి 20 సంవత్సరాలు వచ్చాయి. తాత, తండ్రి ఇచ్చిన ఆస్తిపాస్తులతో, ఉన్నత విద్య సాగించుకున్నాడు. చందమామవంటి అందం కలిగినవాడతను. పెద్దఫ్యాక్టరీలో గొప్ప ఉద్యోగం వచ్చిందని విని ఆనందబాష్పాలు రాల్చింది మీనాక్షి. పట్నానికి తనకాపురం మార్చడానికిగాను అత్తగారితో సంప్రదించి ఊళ్ళోని యిలు అమ్మించి, పట్నంలో ఇల్లు కొనిపించింది. 'బాబూ, జాగ్రత్త' అంటుండేది ముద్దు ముద్దు కొడుకుతో. 'దేనిగురించమ్మా జాగ్రత్త?' అని నవ్వేవాడు మధు. ఆ నవ్వులో భర్త కనుపించగా మీనాక్షి హృదయం ఝల్లుమనేది. చేతులు వణికేవి. తలలో ఏళ్ళి తెల్లగా పండిపోయిన తన జుట్టు, బుగలమీది చారలు, నుదుటనున్న గీతలు చూచుకునేది మీనాక్షి..........

......బస్సు టర్మినస్ దగ్గరికి వచ్చేసింది. బైట ముసురు పట్టింది. మూసీ నది మీద వానపడుతోంది. బూజు పట్టినట్లుంది దూరంగావున్న దృశ్యం. తన జీవితంలాగా వున్నది ఈ ప్రకృతి, ఈ వూరు అనుకుంది మీనాక్షి. కానీ ఒక్కటే తేడా దూరాన మినుకుమనే దీపాలు, రకరకాల కాంతులతో, రంగులతో వింతగా వెలిగే దీపాల తోరణాలు కనిపిస్తున్నాయి, ఈ వూళ్ళో. తన జీవితంలో అల్లాంటి వేవీ లేవు—. 'ఇవాళ్ళ ఏమివారమో, గురువారం కాబోసు, సోమవారం రమ్మన్నాడు మళ్ళీ ప్లీడరు. ఆనాడు వ్రాయబోయే విలునామా ప్రకారం ఆస్తి అంతా విశ్వవిద్యాలయానికి వెళ్ళిపోతుంది, తనకి నూరేళ్ళు నిండినాక.' మీనాక్షి ముఖానవున్న ముడుతలు, మెల్లిగా, విషాదంగా, నవ్వులాగా కదిలాయి. 'నూరేళ్ళా?—ఏమిటీ కొలత? తనకి చిన్ననాడు తల్లిపోయినప్పుడే నిండలేదూ నూరేళ్ళు? ఈ దేవుడికి లెఖ్ఖలమీద ఎంత ధ్యాస వుందో నా నూరేళ్ళు జాగ్రత్తగా లెఖ్ఖపెట్టిగానీ, నన్ను వెళ్ళనివ్వటం లేదు,' అనుకుంది. బస్సులో ఇద్దరే వున్నారు. బస్సు ఆగింది. ఒకతను దిగిపోయాడు. మళ్ళీ బయలుదేరింది. తను కండక్టరూ మిగిలారు. ఎంత దిగులుగా వుంది యీ బస్సు! చల్లగా వున్న యీసీటు, ఆరిపోతాయేమో అనిపించే యీ దీపాలు, ఎంత దిగులుగావుంది. ఇంతలోనే, తనకథ, తనకళ్ళముందు సినిమా బొమ్మలాగా సాగిపోతోంది. కళ్ళు తెరుచుకున్నా, కళ్ళు మూసుకున్నా సాగక మానదు ఆకథ...

...మధుకి 22 సంవత్సరాలు వచ్చాయి ఓనాడు. ఆ మరునాడు ఫ్యాక్టరీకి వెళ్ళాడు అతను. ఏనాడూ మిషను దగ్గరకు పోయే అవసరం లేనివాడు—ఆనాడు వెళ్ళాడు...

...'ఇంకేముంది నా జీవితంలో' అనుకుంది మీనాక్షి. తను గుండెపగిలి చచ్చిపోలేదు ఆనాడైనా. ఎన్ని సంవత్సరాలు, ఎన్నో చరిత్రలు, కళ్ళారాచూచినా పురాతన కట్టడంలా నిలబడేవున్నది ఆమె.

ఒకేమాట అనుకుంది ఆమె తనకుమారుని శరీరాన్ని చూసి. 'మాఅమ్మ పోయినప్పుడే, ఆమెతోనే, నేనుకూడా ఎందుకు చచ్చిపోకూడదూ?' అని. ఆనాడు తనువు చాలిస్తే ఈకథ, ఈచరిత్ర వుండేదికాదు! కానీ, తనతల్లికి, తండ్రికి, భర్తకి, కుమారునికి—అందరి గమ్యస్థానాలు వేరు! తన గమ్యస్థానమే సుదూరమైంది! బహుదూరమైనది......

...మీనాక్షి సంచి చేతబుచ్చుకుని లేచింది బస్సుదిగడానికి. దిగుతూనే బావురుమని ఏడవాలనిపించింది ఆమెకి. 'ఇందాక, అక్కడ సికిందరాబాదు స్టేషనువద్ద బస్సు కలకలలాడుతూ, జనసమ్మర్దంతో నిండివుండగనే దిగిపోతే ఎంతబాగుండేది! నా హృదయం ఎంత తేలిగ్గావుండేది!' అనుకుంది. కానీ, ఎల్లా? తను ఈ గమ్యస్థానం చేరవలసి వున్నది. ఏకాకిగా, భారంగా చేరవలసివున్నది. ఎక్కడో ఎల్లాదిగనిస్తారు. ఎవరైనా తనని?

క్రిందకిదిగి, ఆపార్కులోకిపోయి, బిగ్గరగా, కరువుతీరా ఏడుద్దామనుకుంది మీనాక్షి.

—కానీ, ఏడవలేదు అలా. తడికూడా లేనికళ్ళను, వూరికే తుడుచుకుని, సన్నని వానలో నడుస్తూ, తన అత్తగారిఇంటివేపు నడిచింది. ★